క్లుప్తంగా

నేడు మండల సమావేశం

కిర్లంపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హెచ్.హరికృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ తోట రవి అధ్యక్షతన జరిగే సమావేశంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

ముగిసిన క్రీడాపోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డిప్యూటీ ప్రో చాన్సలర్

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో 2025కు సంబంధించి నిర్వహించిన ఇంట్రామ్యూరల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీలు ముగిసినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కబడ్డీ, ఖోఖో, చెస్, బాడ్మింటన్, వాలీబాల్ తదితర పోటీలు నిర్వహించగా విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రో వైస్ చాన్సలర్ ఎస్.రమాశ్రీ, డీన్ ప్రొఫెసర్ వి.సత్యనారాయణ, ఎన్.రవి, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘ అధ్యక్షుడిగా త్రిమూర్తులు



తుని పెన్షనర్ల సంఘ నూతన కార్యవర్గ సభ్యులు

తుని: ప్రభుత్వ పెన్షనర్ల సంఘ తుని శాఖ అధ్యక్షుడిగా ఎం.త్రిమూర్తులు ఎన్నికయ్యారు. స్థానిక పెన్షనర్ల సంఘ భవనంలో 2025–28 సంవత్సరాలకు సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం జరిగింది. సంఘ గౌరవాధ్యక్షుడిగా పి.మాధవరావు, గౌరవ సలహాదారుడిగా జె.సీతారామరాజు, జనరల్ సెక్రటరీగా ఆంజనేయప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డానియేల్ జోసెఫ్, కోశాధికారిగా పి.కృష్ణ, నలుగురు జాయింట్ సెక్రటరీలు, నలుగురు ఉపాధ్యక్షులు, 10 మంది కార్యనిర్వాహక సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఎంవీవీ స్వామి, గౌరవాధ్యక్షులు జి.అప్పారావు తదితరులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు. పెన్షనర్ల సంఘ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా నూతన కార్యవర్గం పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు పెన్షనర్లు పాల్గొన్నారు.

సారాతో ఇద్దరి అరెస్టు



ఎస్.పైడిపాలలో నిందితులతో ఎక్సైజ్ సిబ్బంది

రౌతులపూడి: మండలంలోని ఎస్.పైడిపాలలో సారా స్థావరాలపై గురువారం ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 50 లీటర్ల సారా, 100 కిలోల నల్లబెల్లం, ద్విచక్ర వాహనంతో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు జిల్లా ఎక్సైజ్ సీఐ వై.పట్టాభిచౌదరి తెలిపారు. తుని ఎక్సైజ్ ఎస్‌ఐ శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో పిండివంటల గోవిందు, రామోజు నానాజీలను అరెస్టు చేసి కేసు కోర్టుకు తరలించామని తెలిపారు.

సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్ ప్రారంభం

కిర్లంపూడి: స్థానిక విజ్ఞాన భారతి ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లో సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్‌ను శుక్రవారం ప్రారంభించారు. వచ్చే నెల 8వ తేదీ వరకూ ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తోట సర్వారాయుడు, బాదంపూడి సూర్యనారాయణ, బీజేపీ అధ్యక్షులు శరకణం రాజబాబు, దాడి సూరిబాబు, ప్రిన్సిపాల్ గాడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మండల అధికారుల నంబర్లు

కోటనందూరు:

తహసీల్దార్	80088 03205
ఎంపీడీఓ	98496 63415
మండల వైద్యాధికారి	76750 32399
వ్యవసాయాధికారి	83310 56617
ఎంఈఓ–1	89856 02864
ఎంఈఓ–2	96529 81857
కోటనందూరు పశువైద్యాధికారి	86398 13895
పాతకొట్టాం పశువైద్యాధికారి	94919 34613
ఎస్సై	94409 00773
వెలుగు ఏపీఎం,	80088 04895
ఉపాధిహామీ ఏపీఓ,	70939 98217

మొక్కజొన్న సాగు.. లాభాలు బాగు

- మెట్టలో చెరకుకు ప్రత్యామ్నాయంగా పండిస్తున్న రైతులు
- కంపెనీలతో ముందుగానే ఒప్పందం
- గిట్టుబాటు ధరతో లాభాలు



ఎన్.సూరవరంలో సాగవుతున్న మొక్కజొన్న



పొలంలో ఎండబెట్టిన మొక్కజొన్న కంకులు

తుని రూరల్: తాండవ చక్కెర కర్మాగారం మూతపడడంతో చెరకు తోటలకు ప్రత్యామ్నాయంగా మెట్ట రైతులు మొక్కజొన్న సాగు చేస్తున్నారు. నాలుగైదు సంవత్సరాలు వరకూ చెరకు ప్రధాన పంటగా సాగు చేసిన రైతులు క్రమంగా మొక్కజొన్న సాగుపై దృష్టి సారించారు. వేర్వేరు కంపెనీలతో ఒప్పందాలు చేసుకుని సాగు చేస్తున్న రైతులు ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకూ ఆర్జిస్తున్నారు. మరికొంతమంది రైతులు కంపెనీలతో ఒప్పందం చేసుకోకుండా నేరుగా విత్తనాన్ని కొనుగోలు చేసి మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఇలా సాగు చేసిన రైతులు దిగుబడి ఆధారంగా పెట్టుబడులు పోను లాభాలు పొందుతున్నారు. వాతావరణ పరిస్థితులు, విత్తన రకాన్ని బట్టి ఎకరాకు మూడు నుంచి ఆరు టన్నుల మొక్కజొన్న కంకులు దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. ఆయా కంపెనీలు టన్నుకు రూ.18 వేల నుంచి రూ.22 వేలు వరకూ గిట్టుబాటు ధర చెల్లిస్తున్నట్టు రైతులు తెలిపారు. గిట్టుబాటు ధర ఒప్పందం అయిన తర్వాత పంట సాగు చేస్తున్నారు. ఆయా కంపెనీలు కొనుగోలు చేసిన మొక్కజొన్నను శుద్ధి (ప్రాసెసింగ్) చేసి దేశవిదేశాలకు ఎగుమతులు చేస్తున్నారు.

నియోజకవర్గంలో...

తుని నియోజకవర్గంలో పూర్వం ఏర్పాటు చేసిన తాండవ సహకార చక్కెర కర్మాగారానికి వేలాది మంది రైతులు లక్షల టన్నులు చెరకును సరఫరా చేసేవారు. ప్రధానంగా తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లో వేలాది ఎకరాల్లో చెరకు సాగయ్యేది. వివిధ ప్రభుత్వాలు అనుసరించిన ప్రైవేటీకరణ విధానాలతో రైతులకు, కార్మికులకు సక్రమంగా చెల్లింపులు చేయకపోవడంతో క్రమంగా సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. లక్షల్లో అవసరం ఉండగా 40 వేల టన్నులకు చెరకు ఉత్పత్తి పడిపోయింది. దీంతో 2018–19లో ఫ్యాక్టరీని మూసివేశారు. అప్పటి నుంచి రైతులు వివిధ రకాల పంటలను వేసినప్పటికీ గిట్టుబాటు కాలేదు. దీంతో వివిధ కంపెనీల ప్రతినిధులు ఆయా గ్రామాల్లో పర్యటించి మొక్కజొన్న వేయాలని, గిట్టుబాటు ధర ముందుగానే వెల్లడించడంతో సాగుపై రైతుల్లో ఆసక్తి పెరిగింది.

గ్రామాల్లో జోరుగా మొక్కజొన్న సాగు

తుని మండలంలోని కొలిమేరు, సుభద్రయ్యమ్మపేట, ఎన్.సూరవరం, నందివంపు, డి.పోలవరం, కుమ్మరిలోవ, తాళ్లూరు, కోటనందూరు, తొండంగి మండలాల్లో మొక్కజొన్నసాగు ఊపందుకుంది. గతేడాది వంద ఎకరాల్లోపే సాగు జరిగిన మొక్కజొన్న ఈ సంవత్సరం వెయ్యి ఎకరాలకుపైగా సాగవుతున్నట్టు వ్యవసాయ అధికారులు తెలిపారు. తుని మండలంలోనే 550 ఎకరాలు, కోటనందూరు, తొండంగి మండలాల్లో మరో 450 ఎకరాల్లో పంట వేశారు. మరికొంత మంది రైతులు తీపి మొక్కజొన్న (స్వీట్ కార్న్) సాగు చేస్తూ తుని మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ప్రస్తుతం పంట పక్వానికి రావడంతో ముందుగా నాట్లు వేసిన రైతులు కోతలు కోసి కంపెనీలకు అప్పగిస్తున్నారు. ఈ నెలాఖరుకి పంటపూర్తిగా చేతికి అందుతుందని, కంపెనీ ప్రతినిధులు వచ్చి తూకం వేసి మొక్కజొన్న కంకులను ఎగుమతి చేస్తున్నారని రైతులు తెలిపారు.

10 ఎకరాల్లో సాగు



పదెకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నాను. మరికొంత మంది రైతుల నుంచి మొక్కజొన్న కొనుగోలు చేసి కంపెనీలకు ఎగుమతి చేస్తున్నాను. ఫలసాయంతో పాటు ఎగుమతి చేయడం వల్ల అదనపు ఆదాయం లభిస్తుంది.

– బారుకుల చంటి, రైతు, కొలిమేరు

గిట్టుబాటు ధర బాగుంది



రెండున్నర ఎకరాల్లో రెండు రకాల మొక్కజొన్న పంట వేశాను. 12 టన్నులు వరకూ దిగుబడి వచ్చింది. ఆయా కంపెనీలతో ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం టన్నుకు రూ.18 వేలు, రూ.20 వేలు చొప్పున గిట్టుబాటు ధర లభించింది.

– రెడ్డి శ్రీను, రైతు, కొలిమేరు

నేడు విద్యుత్ అంతరాయం

ఏలేశ్వరం: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరాఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరభద్రరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుల్ వైర్లను ఆనుకొని ఉన్న చెట్లు, తీగలు తొలగించే నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేయనున్నారు. పట్టణపరిధిలోని రాజమండ్రికాలనీ, చైతన్యనగర్, క్వారీపేట, మండలంలోని సి.రాయవరం, రమణయ్యపేట, తూర్పులక్ష్మీపురం, జె.అన్నవరం గ్రామాల్లో విద్యుత్ సరాఫరా నిలిపివేయనున్నట్టు ఆయన తెలిపారు.

తుని: విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకూ తుని మండలం డి.పోలవరం, కేవో మల్లవరం సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు గురువారం తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని ఆయన కోరారు.

తొండంగి: మండలంలోని గోపాలపట్నం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఎ.కొత్తపల్లి ఫీడర్‌కు శుక్రవారం విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలుగుతుందని జగ్గంపేట విద్యుత్ ఈఈ వీరభద్రరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఎ.కొత్తపల్లి ఫీడర్ పరిధిలో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహిళా సంఘాల బలోపేతమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు

కోటనందూరు: మహిళా సంఘాల బలోపేతమే లక్ష్యంగా సిబ్బంది సమన్వయంతో పని చేయాలని డీఆర్‌డీఏ పీడీ జి.శ్రీనివాసరావు ఆదేశించారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో గురువారం సంఘ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలను అభివృద్ధి చేసేందుకు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలన్నారు. పుస్తకాల నిర్వహణ, ప్రభుత్వ కార్యక్రమాల అమలు సజావుగా జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి తదితర రికవరీలు 100 శాతం జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. సంఘాల అభివృద్ధిపై ఎప్పటికప్పుడు సభ్యులను చైతన్య పరచాలని చెప్పారు. కార్యక్రమంలో డీపీఎం కేశవ, ఏజీఎం చిట్టిబాబు, ఏపీఎంలు సూర్యనారాయణ, సురేష్, సూర్యకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ముద్రగడ పరామర్శ



రౌతులపూడిలో వాసిరెడ్డి బొజ్జమాస్టార్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ముద్రగడ గిరిబాబు

రౌతులపూడి: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు గురువారం పర్యటించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. రౌతులపూడిలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వాసిరెడ్డి కొండలస్వామి (బొజ్జ మాస్టార్) స్వగృహానికి వెళ్లి ఆయన కుమారుడు వాసిరెడ్డి శివప్రసాద్‌ను పరామర్శించారు. బొజ్జ మాస్టార్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గుమ్మరేగుల్లో ఇటీవల మృతి చెందిన పార్టీ కార్యకర్త వెంటూరి జయబాబు కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మెరక చామవరంలో అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ నాయకుడు ఎమ్మిలి వీరబాబును కలసి ఆరోగ్యంపై ఆరా తీశారు. వీరబాబు త్వరగా కోలుకుని పార్టీకి సేవలందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వాసిరెడ్డి జమీలు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సీహెచ్ వీవీ సత్యనారాయణ, నియోజకవర్గ ఎస్టీ విభాగం అధ్యక్షుడు చెన్నాడ సత్తిబాబు, రౌతులపూడి ఉపసర్పంచ్ వాసిరెడ్డి భాస్కరబాబు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, సర్పంచులు రాపర్తి రామకృష్ణ, అడపా మురళి, సోమరౌతు తిరుముల వెంకన్నదొర, అంకంరెడ్డి సతీష్‌కుమార్,బండారు ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు
- ఉగ్రదాడికి నిరసనగా ప్రత్తిపాడులో కొవ్వొత్తుల ర్యాలీ



ప్రత్తిపాడులో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న ముద్రగడ గిరిబాబు, పార్టీ నాయకులు

ప్రత్తిపాడు: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో 27 మంది హిందూ పర్యాటకులను కాల్చి చంపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు డిమాండ్ చేశారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడికి వ్యతిరేకంగా ప్రత్తిపాడులో వైఎస్సార్ సీపీ శ్రేణులు గురువారం రాత్రి భారీ ఎత్తున నిరసన తెలిపారు. ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక అంబేడ్కర్ కళా మందిరం నుంచి మహాత్మాగాంధీ సెంటర్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దాడిలో మృతి చెందిన పర్యాటకుల మృతికి సంతాపం తెలిపి కొద్దిసేపు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదులు మతపిచ్చితో హిందూ పర్యాటకులను కాల్చి చంపడం దారుణమన్నారు. భారతదేశ సమైక్యతను దెబ్బతీయడానికే ఈ పిరికిపంద చర్యకు ఒడిగట్టారని పేర్కొన్నారు. మారణహోమాన్ని సృష్టించిన ముష్కరులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, వైస్ ఎంపీపీ బంకు శ్రీను, పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, ప్రత్తిపాడు, శంఖవరం, ఏలేశ్వరం మండల, పట్టణ పార్టీ కన్వీనర్లు రామిశెట్టి బులిరామకృష్ణ, నరాల శ్రీను, గొల్లపల్లి సురేష్, శిడగం వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు సామంతుల సూర్యకుమార్, జల్లిగంపల ప్రభాకరరావు, శేరు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర దాడికి నిరసనగా ర్యాలీలు

తుని: జమ్ముకశ్మీర్‌లో రక్తపాతం సృష్టించిన ముష్కరులతో పాటు పాకిస్తాన్‌కు భారత్ తగిన గుణపాఠం చెప్పాలని తుని వాకర్స్ క్లబ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఉగ్రదాడికి నిరసనగా గురువారం సాయంత్రం గణపతినగర్ పార్కు నుంచి సూరవరం రోడ్డు వరకూ వాకర్స్ సిటీ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన పర్యాటకుల ఆత్మకు శాంతి కలగాలని నివాళులర్పించారు. మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని నినాదాలు చేశారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షులు లోకారెడ్డి అప్పారావు, మలిపెద్ది నాగేశ్వరరావు, గవర్నర్ సీహెచ్ సోమేశ్వరరావు, మాజీ గవర్నర్ చోడిశెట్టి రాంబాబు, పలువురు వాకర్లు పాల్గొన్నారు.

మారణకాండను నిరసిస్తూ..

ప్రత్తిపాడు: జమ్మూకశ్మీర్‌లో తీవ్రవాదులు జరిపిన మారణకాండను నిరసిస్తూ ప్రత్తిపాడులో గురువారం సాయంత్రం ర్యాలీ చేపట్టారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం నుంచి అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకూ ర్యాలీ సాగింది. అనంతరం అల్లూరి జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. పాకిస్తాన్ తీవ్రవాదులకు వ్యతిరేక నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శింగిలిదేవి సత్తిరాజు, పల్లా శ్రీను, స్వయం సేవకులు చిట్రా అప్పారావు, సీహెచ్ సత్తిబాబు, కొమిరిశెట్టి భీమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో మానవహారంగా ఏర్పడిన ప్రజలు



తునిలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న వాకర్లు

కిర్లంపూడి: జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర దాడికి నిరసనగా జనసేన జగ్గంపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో గురువారం కిర్లంపూడిలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి జగపతినగరంలోని సూర్యరామ థియేటర్ వరకూ కొవ్వొత్తుల ర్యాలీ చేశారు.

పంచాయతీలతోనే ప్రగతి



ఏలేశ్వరంలో ఎంపీడీఓ, ఏపీఓలను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు



గండేపల్లిలో గాంధీజీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, అధికారులు

- ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం
- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు

ఏలేశ్వరం: పట్టణంలో గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1993 ఏప్రిల్ 24న 73వ రాజ్యాంగ సవరణ చట్టం అమలులోకి రావడంతో అదే రోజున ఏటా పంచాయతీరాజ్ దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. పంచాయతీరాజ్ చట్టం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి వేగవంతమైందన్నారు. అనంతరం ఉపాధిహామి పథకంలో మండలం నాలుగో స్థానం సాధించడంతో ఎంపీడీఓ సూర్యనారాయణ, ఏపీఓ సత్యనారాయణలను ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఘనంగా సన్మానించారు. లింగంపర్తిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని గురువారం అట్టహాసంగా నిర్వహించారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు మహాత్మాగాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, ఎంపీటీసీలు, ఏపీఓ ఎం కృష్ణంరాజు, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: మండలవ్యాప్తంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ కుమార్ బాబు పంచాయతీ రాజ్ దినోత్సవ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను (బంకు శ్రీను), ఈఓఆర్డీ కేవీవీఎస్ కాశీ విశ్వనాథం, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, ఏఈలు సత్యప్రకాష్, జి. సుబ్బలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకుడు పినిశెట్టి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ సుంకర శ్రీవల్లి అధ్యక్షతన పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు ఎంపీపీ, వైస్ ఎంపీపీలు మడికి మైనర్‌బాబు, గోకాడ చిట్టిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోవిందు, స్థానిక నాయకుడు సుంకర వీరబాబు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో ప్రసంగిస్తున్న ఎంపీపీ కాంతి సుధాకర్



గోకవరంలో గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేస్తున్న ఎంపీపీ శ్రీవల్లి

ఇవేం పనులు !

- గ్రామాల్లో అసంపూర్తిగా సీసీ రోడ్డు పనులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మన్యవారిపాలెం రామలయం వీధిలో నిలిచిపోయిన సీసీ రోడ్డు పనులు

జగ్గంపేట: మన్యవారిపాలెం పంచాయతీ పరిధిలోని ఓ వీధిలో సిమెంట్ రోడ్డు సగం వేసి వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టర్ పనులు మధ్యలో ఆపేయడంతో కాలనీవాసుల వాహనాలు వెళ్లడానికి, రావడానికి దారిలేకుండా పోయింది. జగ్గంపేట మండలం రామవరం వద్ద కూడా ఇదే తరహాలో ఆర్అండ్‌బీ రోడ్డు కొంత దూరం వేసి వదిలేశారు. ఆ సమస్యకు అధికారులు పరిష్కారం చూపించడం లేదు. ఇప్పుడు మళ్లీ అదే కోవలో మన్యవారిపాలెంలో సిమెంట్ రోడ్డు ఆగిపోయింది. మన్యవారిపాలెంలో రోడ్డు ఆగిపోవడానికి నేతల నుంచి వచ్చే బెదిరింపులే కారణమని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రూ.10 లక్షలతో..

మన్యవారిపాలెంలో రామాలయంలో వీధిలో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో 160 మీటర్ల సిమెంట్ రోడ్డు నిర్మాణం ప్రారంభించారు. 140 మీటర్ల మేర రోడ్డు వేశారు. మరో 20 మీటర్లు రోడ్డు వేసే సమయంలో స్థానిక నేతలు, కాంట్రాక్టర్‌కు మధ్య సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. దీంతో కాంట్రాక్టర్ నేతలకు దండం పెట్టి పని మానేసి అక్కడ నుంచి రోడ్డు వేసే సామగ్రిని వేరే ప్రాంతానికి తరలించుకుని పోయినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో స్థానికులకు కష్టాలు మొదలయ్యాయి. దీనిపై జగ్గంపేట పంచాయతీ రాజ్ ఏఈ లక్ష్మీనారాయణను వివరణ కోరగా కొన్ని సాంకేతిక సమస్యలతో పాటు, మెటీరియల్ కొరత కారణంగా పనులు ఆగిపోయాయన్నారు. వారం రోజుల్లో రోడ్డు పని పూర్తి చేస్తామని తెలిపారు.

పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న వీరబాబు

ప్రత్తిపాడు రూరల్: పదో తరగతి ఫలితాల్లో మండలంలోని ఒమ్మంగి శ్రీభారతి విద్యానికేతన్ విద్యార్థులు సత్తా చాటారు. తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపి మండల స్థాయిలో ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నట్టు ఆ సంస్థ కరస్పాండెంట్ సుంకర వీరబాబు తెలిపారు. తమ విద్యార్థులు పల్నాటి లాస్య మనస్విని 588/600 మార్కులు సాధించి మండల ప్రథమ స్థానం, గొర్ల దుర్గ వైష్ణవి 583/600 మార్కులు సాధించి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకోగా పాడగట్ల సాయి పూజ 581/600, జల్లిగంపల ఉమ 569/600 మార్కులను సాధించారని చెప్పారు. తమ సంస్థ నుంచి పరీక్షలకు హాజరైన 69 మంది విద్యార్థులు పాస్ కావడంతో వంద శాతం ఉత్తీర్ణతను సాధించగా వారిలో 10 మంది 550 మార్కులు, 35 మంది 500 లకు పైగా మార్కులను సాధించారని ఆయన వివరించారు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను సంస్థ కరస్పాండెంట్ సుంకర వీరబాబు, ఉపాధ్యాయలు అభినందించారు.